
# ఇదా (మా)నవత?

— పవని నిర్మల ప్రభావతి



''నా జ్యేష్ఠ పుత్రిక

చి. సౌ. మధురిమను

...వాస్తవ్యులు...శ్రీ...గారి..ద్వితీయ పుత్రుడు, చి. నరసింహారావుకు ఇచ్చి..

ఇట్లు

మాధవరావు."

చేతిలోనిశుభలేఖ పదిమాట్లయినాచదివి వుంటుంది వసంత. చాలా సింపుల్‌గా వుంది శుభలేఖ. ఆఖరులో శ్రీ-శ్రీమతి అని వుండవలసినచోట, మాధవరావు ఒక్క పేరే వుంది. శ్రీమతి పేరు వేయ వలసినచోటు ఖాళీగానే వుంది. అవును అది ఖాళీగానే వుంది.

ఆ నరసింహారావెవరో, ఎలా వుంటాడో, ఏం చదువుకున్నాడో, ఏ ఉద్యోగం చేస్తున్నాడో...మధురిమను నచ్చి, మెచ్చి చేసుకుంటున్నాడో, లేక మాధవరావు ఆత్మాభిమానం వదిలి ప్రాధేయపడితే అంగీకరించాడో ...? ఛీఛీ. మాధవరావెప్పుడూ ఆత్మాభిమానం పోగొట్టుకొనే వ్యక్తికాడు. అత గాడికున్న సంపదే అది; మధురిమ తల్లి లేని బిడ్డ...తల్లిలేని బిడ్డా!

మధురిమ పెళ్ళి! ఎదలో అట్టడుగు పొరల్లో ఏదో ఆనందం. మరేదో ఆవే దన...పోనీ, పెళ్ళికి తను వెళ్తే... ఊహు. వెళ్ళలేదు.

''వసూ! ఎక్కణ్ణుంచి పోస్ట్? శుభ లేఖా? పెళ్ళిళ్ళ సీజన్ కదూ ఇది. ఇంతకూ ఎవరిపెళ్ళిట?" అప్పుడే కోర్టు నుంచి ఇంటికివచ్చిన లాయరు వాసుదేవ రావు, నల్లకోటు విప్పుతూ అడిగాడు

"మధురిమ పెళ్ళి. మాధవరావు పంపాడు శుభలేఖ!" ఎంత మామూలుగా చెబుదామన్నా ఏదో తడబాటు ఆమె కంఠస్వరంలో.

"ఐ సీ...గుడ్ న్యూస్. మాధవ రావుకు పెద్ద బాధ్యత తీరిపోతోంది." తేలిగ్గా నవ్వబోతూ అన్నాడు. నవ్వు రాలేదు. ఆ మాటలు కూడా సహజంగా గాక, ఏదో మొక్కుబడిలా అన్నట్లు ధ్వనించిందాయన కంఠస్వరం.

మాధవరావుకు పెద్ద బాధ్యత తీరు తోంది...మరి తనకు లేదా ఆ బాధ్యత? వసంతకు ఊపిరాడలేదు.

"పోనీ పెళ్ళి, మనిద్దరి తరపునా ఏదైనా మంచి ప్రెజెంటేషన్ ఇచ్చిరా వసూ!" అన్నాడు వాసుదేవరావు బాత్ రూంవైపు వెళ్తూ...

"ఊహూ! వద్దు... నాకు ఒంట్లో బాగాలేదు..." పొడిగా అంది. వాసుదేవ రావు తేలిగ్గా నిట్టూర్చాడు. నిజానికి వెళ్ళమన్న నిండైన కోరిక లేదతగాడికి. అదో ఫార్మాలిటీ! అంతే.

"మమ్మీ! ఈ రోజు కాలేజీలో డ్రామా వుంది! వచ్చేసరికి పొద్దుపోతుంది. రాలే దని కంగారుపడకేం?'' అంటూనే లుంగీ మరోమారు సరిచేసుకుని, చొక్కాకాలర్ ఇంకోసారి సరిచూచుకుని, బయటకు నడిచింది సుజాత. కొత్తగా ఇంటర్ మీడియట్‌లో చేరింది; నవనాగరికతకు మారురూపులావున్న పిల్ల ఇది.

"మమ్మీ! నేనూ సినిమాకు వెడు తున్నా!" ఇక అనుజ్ఞకోసం చూడ కుండానే పరుగెత్తాడు పన్నెండేళ్ళబాబు.

''నేనూ క్లబ్బుకు జారుకోనా?'' నవ్వుతూ బాత్‌రూంనుంచి వచ్చాడు వాసుదేవరావు.

వసంత నవ్వింది పేలవంగా.

"ఈరోజు తమరి మూడ్ బాగాలేన ట్టుంది దేవిగారూ! నే నలాబయటకు వెళ్ళొస్తాను. కానీ ఒక్కమాట గుర్తుం చుకో వసూ! అనవసరంగా అతి ఆలోచనలు చేసినందువల్ల మనిషికి ఒరిగేదేమీలేదు. తలనొప్పి రావటంతప్ప! జీవితమనుభవించటానికేగానీ, ఆలోచించ టానిక్కాదు...'' వాసుదేవరావు క్లబ్బుకు వెళ్ళిపోయాడు. ముచ్చటగావున్న ఆ యింట్లో, తనూ, తన భర్త...ఇద్దరు పిల్లలు...ఇలాటి జీవితం అనుభవించ టానికే...అనుకుంది లోగా చాలామార్లు.

ఆ భ్రమే కొన్ని సంవత్సరాలక్రితం, తనను తీవ్రంగా ఊపివేసింది. కానీ యౌవనం ఛాప్టరు ముగిసి ... కొద్ది కొద్దిగా తలనెరుస్తున్న ఈ రోజులలో, ఈ మధ్య జీవితం అనుభవించటానికే

కాదు. ఆలోచించి ఆచరించటానిక్కూడా అన్న నగ్నసత్యం బోధపడుతోంది. తన మారిన ఆలోచనల తీరు వాసుదేవ రావుకు నచ్చటంలేదు.

"వసూ! నువ్వూ అందరు ఆడవాళ్ళ లాటిదానివేనా? నీ ఆదర్శాలు ఏమై పోయాయి? వంటింటి కుందేళ్లలా పడివుండే ఎందరో ఆడవాళ్ళకు, నీ ప్రవర్తన, నీధైర్యం...నీఆదర్శం మార్గ దర్శకం అవుతుందనుకున్నాను. అది కేవలం తాత్కాలికమైన ఆవేశమేనా? అదే నిజమైతే..ఈ క్షణంలోనూ నీకు నేను ఏలాటి అడ్డూ, హద్దూ పెట్టలేను. నీకు శాంతిగా వుంటుందనుకొన్న చోటుకు వెళ్లు...''అంటున్నాడు.

తనెక్కడికి వెళ్తుంది? ఎలా వెళ్తుంది? సుజాత, రాజా...వీళ్ళిద్దరూ తన బిడ్డలు ...వాళ్ళని వదిలి వెళ్తే...?

కానీ ఆనాడు ఏ బలవత్తరశక్తి ప్రేరేపణ తనను బిడ్డలమీది మమకారాన్ని కూడా త్రుంచివేసి, బయటకు లాగింది? ఆమె తల పగిలిపోతోంది ఆలోచనలతో. గతమంతా పెద్ద కొండలా నెత్తిమీద ఆగినట్లయింది. ఒక్కో సంఘటనా చిన్న చిన్న రాళ్లలా దొర్లిపడసాగాయి.

* * *

పురిటిగదిలోకి వచ్చి మంచంమీద పాపపక్కన పడుకొనివున్న వసంత వేపూ, పాపవేపూ మార్చి మార్చి చూచిన మాధవరావు సంతృప్తిగా నవ్వాడు.

"పాప అచ్చు నీ పోలికే వసూ! అందంగావుంది," అన్నాడు.

వసంత నవ్వింది. "మరి...సినిమాల్లో ...నవలల్లో అయితే...ఇంత చక్కటి బహుమతి ఇచ్చిన భార్యను...అమాంతం చేతుల్లో ఎత్తుకుని, గిరగిర తిప్పి, ముద్దెట్టుకొనేవాడు హీరో ... మరి మీరో?" అంది. మాధవరావు గది బయట స్టూలుమీద కూర్చుంటూ నవ్వాడు. "అది సినిమానోయ్ అమ్మడూ! లేదా నవల! ఇది జీవితం. ఈ గదంతా పురిటివాసన...నీ దగ్గరా ఏదో వాసన. ఇప్పుడు ముద్దాడటం ఇంపాజిబుల్! నాకే కాదు. ఏ మగాడికీ . అందుకే చెబుతున్నాను. నువ్వింకా పెరగాలి మానసికంగా... నువ్వు అన్ని రకాల రచనలూ చదువు...కాదనను. కానీ వాటిలో నిత్యజీవితానికి సన్నిహితంగావుండే వాస్తవ రచనలను గురించి ఆలోచించు...నీ దృక్పథంలో జీవితంపట్ల వాస్తవమైన ఆలోచనలు వికసించాలి. అంతేగానీ, కలల్ని కథలుగా మార్చి వ్రాసేవారి రచనలను నేను సహించలేను ... సమర్థించలేను ..." అన్నాడు.

నిజమే. మాధవరావు వాస్తవికతావాది. స్త్రీ ఫ్రీగా ఆలోచించగలగాలి, ఆచరించగలగాలి..ఆర్థికస్వాతంత్ర్యాన్ని పొందాలి. అప్పుడే ఆమె మనసూ, సంసారమూ కూడా సుఖంగా శాంతిగా వుంటాయి. ఫోర్తుఫారమ్ వరకే చదివిన వసంతను...మెట్రిక్‌కు కట్టించి చదివించాడు. అది పాసయ్యాక పి.యు.సి. ఆ తర్వాత బి.ఏ....కాలేజీలో చేర్పించాడు. పెళ్లైన ఆరేళ్ళలో బి.ఇడి. పూర్తి చేయించాడు. అనుక్షణం అతగాడి ప్రోత్సాహం, శిక్షణ...ఆమెను డిగ్రీ సులభంగా తీసుకొనేలా చేసాయి...

"పాపకు మధురిమ అని పెడదాం. పేరు బావుంది కదూ?" అంది వసంత. పెళ్లైన ఆరేళ్లతర్వాత అపురూపంగా పుట్టినపాప!

"చాలా బావుంది. మన దాంపత్య జీవన మధురిమకు ప్రతిబింబం మన పాప!" అన్నాడు మాధవరావు..

మరో రెండేళ్లలో బాబు పుట్టాడు. ఆసరికి వసంత చాలా మారిపోయింది. బయటి ప్రపంచంలో ఫ్రీగా తిరగటం బెరుకులేకుండా బయటిపనులు చక్క బెట్టుకురావటం అలవాటయింది. చిన్న చిన్న కథలు వ్రాస్తోంది. ఆమెకు రచయిత్రిగా ఓ గుర్తింపూ వస్తోంది.

"నువ్వు రాసే ప్రతి రచనా సమాజానికి ప్రతిబింబంగా వుండాలి వసూ! నీ రచనల్లో ప్రతి అల్పజీవీ, అట్టడుగున పడివున్న ప్రతిప్రాణీ తన ప్రతిబింబాన్ని చూచుకోగలగాలి. తమబాధ ప్రపంచంలోని ఒక్కరయినా గ్రహించగలిగారన్న సంతృప్తి పొందాలి. అదీ నిజమైన సాహిత్యం. ఆ ధ్యేయాన్ని నీ కలం చేరుకొనేవరకు, నువ్వు రాసేవి గొప్ప రచనలనీ నువ్వో రచయిత్రివనీ అహం కారపడకు!" అంత నిర్మొహమాటంగా చెప్పగల సద్విమర్శకుడు తన భర్తే కావటం, అదృష్టమనిపించింది వసంతకు.

మధురిమ, బాబు పెరుగుతున్నారు. జీవనప్రమాణం పెరుగుతోంది. ధరలు పెరుగుతూనే వున్నాయి. మాధవరావు ఒక్క ఉద్యోగంమీద ఇల్లుగడవటం కష్టంగా వుంది...

"నేనూ ఉద్యోగం చేస్తాను" అంది వసంత.

"తప్పకుండా!" అన్నాడు మాధవరావు.

నెల తిరిగేసరికి టీచరుగా చేరింది వసంత...అటు రచయిత్రిగా పేరూ. ఇటు ఉద్యోగినిగా ఒక్కో మెట్టూ పైకి పోతోంది ఆమె.

ఎనిమిదేళ్ళు తిరిగేసరికి వసంత ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా మారింది. పలుకుబడి, కాంపులు, సన్మానాలూ, సభలూ, ఆమె ఇంటిపట్టున వుండటమే తక్కువైంది.

మధురిమ సెకెండుఫారంలోకి వచ్చింది. బాబు నాలుగోక్లాసులోకి వచ్చాడు. వసంత కాంపులవల్ల, పిల్ల


లిద్దరూ మాధవరావుదగ్గరే చనువుగా పెరుగుతున్నారు.

వసంత ఆలోచనలు మారిపోతు న్నాయి . . . ఎన్నో మనస్తత్వాలు .. ఎందరితోనో పరిచయాలు, ఎన్నో రకాల కథలూ ఆమెలో కొత్త ఊహలను రేపుతున్నాయి.

మగాడు తప్పుచేస్తే సంఘం క్షమి స్తోంది. ఆడది అదే తప్పుచేస్తే సంఘమూ ప్రకృతీ ఎందుకు క్షమించటంలేదు? ఎక్కడుం దీతేడా? పదిమార్లు పెళ్ళా డటం పురుషుడికి హాబీ అయితే–విధవ అయినా పెళ్ళాడే స్వాతంత్ర్యం స్త్రీకి లేకపోవటమేమిటి? భర్తలో తనకు నచ్చని గుణాలు, భావాలూ వున్నా స్త్రీ ఎందుకు సర్దుకుపోవాలి?

ఆ ఆలోచనలే రచనల్లోనూ, మాటల్లోనూ బయటపడటం మొద లెట్టాయి. మొదట్లో మాధవరావు నవ్వే వాడు. "ఆవేశం ఎక్కువైతే, ఆలోచన తప్పుదారి పడుతుంది వసూ. మనిషి క్కావలసింది ఆలోచనతో కూడిన ఆత్మ విమర్శ. స్త్రీకీ పురుషుడికీ ప్రకృతి సహజమైన కొన్ని కట్టుబాట్లు వున్నాయి. అవి తొలగిపోతే–బలవంతంగా తొలగిస్తే ఆడారి మగాడు–మీసాల స్త్రీలా విపరీత పరిణామాలు ఎదురౌతాయి. విపరీతమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు స్త్రీ కోరితే, ఆమె కుటుంబజీవనం, ఆమె బిడ్డల భవిష్యత్తు దెబ్బతింటుంది. కన్నతల్లిని గురించిన అసహ్యకరమైన నిందలు బిడ్డలు సహించలేరు. అందుకే వ్యక్తి పరంగా, సమాజపరంగా, స్త్రీకి కొన్ని కట్టుబాట్లు తప్పనిసరి అయ్యాయి!" అలా మాధవరావు వివరణ చెబుతోంటే, వసంతలో ఏదో కసి పెరుగుతోంది.

యుగయుగాలుగా మగాడు ఇలాగే స్త్రీని ఎన్నోరకాల మోసపుకథలతో, మాటలతో ఉచ్చుతాళ్ళు బిగించివుంచాడు. ఆమెను సుఖానికీ, స్వాతంత్ర్యానికీ




దూరంచేశాడు. ఈ జులుంనుంచి స్త్రీ బయటపడాలి... తననీ మాధవరావు మోసంచేస్తున్నాడేమో! అంచేతే ఈ మధ్య తను ఎవరితో చనువుగా మాట్లా డినా, తిరిగినా, ఉద్యోగరీత్యా అది తప్పనిసరి అని తెలిసినా..."జాగ్రత్త! జాగ్రత్త!" అంటూ హెచ్చరికలు చేస్తున్నాడు. ఛీ! ఛీ! ఇంత సంకుచిత మైన హెచ్చరిక. తను సహించలేదు.

స్త్రీకి భర్తా – పిల్లలే కాదు లోకం తనకూ ఆర్థికస్వాతంత్ర్యంవుంది. తన కాళ్లమీద తను బ్రతగ్గలదు...అదే విని మాధవరావు మండిపడ్డాడు. "నీ దృష్టే మారిపోయింది వసూ! నీ కళ్లకు ఏవో పొరలు కమ్మాయి...మగాడు ఎలాగో ఓలా సంపాదించేదీ, కష్టపడేదీ ఎవరి కోసం? తన భార్యాబిడ్డలకోసం...తన కుటుంబసౌఖ్యంకోసం కానీ నీలాటి స్త్రీకి లభించిన ఆర్థికస్వాతంత్ర్యం, ఆమెను స్వార్థపూరితురాలిగా–ఫ్రీ సెక్స్ సింబల్‌గా మారుస్తోంది!"

ఆ మాటెందుకన్నాడో, అర్థమయింది వసంతకు. ఈ మధ్య తరచూ వాసుదేవ రావు తనకోసం, ఇంటికి వస్తున్నాడు. అప్పుడప్పుడూ కాంపులకూ వస్తున్నాడు. అతగాడు లాయరు. బాగా డబ్బుంది. లాయరుగా ఆర్జిస్తున్నాడు. ఇంకా పెళ్ళి చేసుకోలేదు ఎంచేతో! తన భావాలను మెచ్చుకుంటున్నాడు. మాధవరావు సంకుచిత స్వభావాన్ని నిరసిస్తున్నాడు.

"మీకు జలసీ!" అంది వసంత మాధవరావుతో.

"అవును వల్లమాలిన జలసీ వుంది నాకు. నీమీదవున్న వల్లమాలిన ప్రేమతో ఏర్పడిన జలసీ అది. నేను నాటి పాదు చేసి, పెంచి పోషించిన తీగె అందంగా పందిరికి అల్లుకోవటంమాని ముళ్లకంచెను ఆశ్రయిస్తోందన్న జలసీ అది...నువ్వు నాదానివి. నీ సంసారాన్ని దిద్దుకోవలసిన బాధ్యత నీ మీదా, నామీదా వుంది. నీవది గుర్తించనప్పుడు–బై ఫోర్స్... గుర్తింపజేస్తాను, భర్తగా నాకా హక్కూ, బాధ్యతా, అధికారం వున్నాయి. పెరుగు తున్న పిల్లల భవిష్యత్తుదృష్ట్యా. వాళ్ల దృష్టిలో వాళ్లతల్లి ఒక స్వైరిణిగా, తండ్రి ఒక చవటగా ముద్రవేసుకోవటం ఇష్టంలేని దృష్ట్యా, నేను నీకు హద్దులు నిర్ణయించక తప్పటంలేదు...వాసుదేవ రావు నీ అభిమానే కావచ్చు. ఉద్యోగ రీత్యా నీకు పురుషులతో కలిసిమెలిసి తిరగటం తప్పనిసరే కావచ్చు...కానీ వాసుదేవరావుతో నీ చనువు, నీ ప్రవర్తనా

పదుగురిదృష్టిలో పలురకాల అపోహలకు దారితీస్తోంది. నాలోనూ సహనాన్ని, సభ్యతనూ చంపుతోంది. భర్తగా శాసిస్తున్నాను...అతగాడితో ఇకమీదట నువ్వు చనువుగా ప్రవర్తించవద్దు. అతగాడేకాదు, ఏ పురుషుడితోనూ నీ హద్దులు అతిక్రమించవద్దు..."

ఇంతటి అఘాతం వసంత తట్టుకోలేకపోయింది. ఆమె పరిస్థితీ, మనస్థితీ గమనించిన వాసుదేవరావు మర్నాడే తన నిర్ణయం తెలిపాడు.

"వసూ! ఆలోచనచేయటానికి కాదు జీవితం. అనుభవించటానికే. బిడ్డల తల్లివని చులకన చెయ్యను. భర్తనొదిలి వచ్చావని నరకం చూపించను. నా హృదయంలో నీకుగల ఉన్నతస్థానం ఏనాడూ తొలగనివ్వను...''


ఆరోజే వసంత చెవులూ, కళ్ళూ మూసుకుపోయాయి. మధురిమ, బాబులకు తండ్రిదగ్గిర చనువెక్కువ. వాళ్ళిద్దరికీ తన అవసరం అట్టేలేదు... శాసించే భర్త తన కనవసరం.

"మనిద్దరం విడాకులు పుచ్చుకుందాం!" అంది వసంత మాధవరావుతో.

"అవసరంలేదు. మానసికంగా అదే నాడో జరిగిపోయింది మన మధ్య. బహిరంగంగా గొడవపడటం నాకిష్టంలేదు.., పిల్లలనుమాత్రం నా దగ్గరే వుంచుకొంటాను. నీమీద వ్యామోహంవుంటే వుండవచ్చు వాసుదేవరావుకు...కానీ నీ బిడ్డలమీద వాత్సల్యం వుండటం కల్ల! వెళ్లు!"

మాధవరావు ఇంటినుంచీ, హృదయం నుంచీ బయటకువచ్చి, వాసుదేవరావు ఇల్లాలుగా మారింది వసంత.

"స్త్రీ స్వాతంత్ర్యానికి మారురూపు మా వసంత. మార్గదర్శి ఆమె. ఆమె నన్ను వదిలి మరొకణ్ణి కోరుకున్నా... నేను ఈర్ష్యపడను...అడ్డుచెప్పను...




నీరూ, నేలా, నింగీ, గాలీ, వెల్తురూలానే స్త్రీకి హద్దులుండకూడదు. అదే నా ఆదర్శం!" అంటూ వాసుదేవరావు గొప్పగా పరిచయం చేసుకుంటున్నాడు వసంతను తన స్నేహితులకూ, బంధువులకూ ఆ మాటలలోని ఏదో మైకం వసంతకు మాధవరావునూ, పిల్లలనూ గుర్తుకు రానివ్వటంలేదు. పుష్కలంగా డబ్బుంది, సంపాదన అవసరంలేదు వసంతకు. అంచేతే ఉద్యోగం మానేసింది.

సుజాత, రాజు ... నాలుగేళ్ళలో ఇద్దరు పిల్లలు పుట్టారు...మధురిమ, బాబు గుర్తుకొస్తున్నారు ఈ పిల్లల ప్రతి కదలికలో! పిల్లలిద్దరూ పెరుగుతున్నారు ...ఏదో అశాంతి పెరుగుతోంది వసంతలో.

తనబిడ్డలు వీళ్లిద్దరూ. వాళ్ళిద్దరూ తన బిడ్డలే. కానీ వీళ్ళకు తల్లిగా తనుంది! వాళ్ళకు తనులేదు!

మాధవరావు మళ్ళీ పెళ్ళాడలేదు... పిల్లలు కష్టపడతారని! బిడ్డలను ఎవరైనా ఏమైనా అంటే మండిపడతాడుట.

"మీకు హృదయంలేదా ఆ తల్లిలానే! ఆమె చేసినతప్పుకు పిల్లల్నా శిక్షిస్తారు?"

ఒకప్పుడు ... మధురిమను ఎలాటి యువకుడికిచ్చి పెళ్ళిచేయాలి అన్న విషయమై చర్చించుకొనేవారు, వసంత మాధవరావు సరదాగా. తను మిసెస్ మాధవరావుగా మారాక, మధురిమ పెళ్లి ఓ సమస్యగా మారింది! పాతికేళ్ళు

వచ్చినా మధురిమకు పెళ్ళికాలేదు! ఎమ్.ఎస్‌సి. పాసైంది....

ఓసారి వాసుదేవరావూ, తనూ షాపింగ్‌కు వెళ్తుంటే మాధవరావూ, మధురిమ, బాబు ఎదురయ్యారు. మాధవరావు తలంతా నెరసిపోయి, శతవృద్ధులా వున్నాడు! అతగాడిలో ఎంతటి హాలాహలం జీర్ణమైవుందో చూచేవాళ్ళకి ఇట్టే అర్థమౌతుంది. మధురిమ చాలా అందంగా వుంది. బాబు బాగా పొడుగయ్యాడు...

"బాగున్నావా మధూ - బాబూ!" అంటూ ఆప్యాయంగా పలకరించింది...

"బాగానే వున్నాం!" అంతే ముక్తసరి సమాధానం.

"మీ అమ్మని..." ఏదో చెప్పబోయింది, ఎదలోపలి భావావేశంతో.

"ఊహూ, మాకు అమ్మలేదు. మా అమ్మ చచ్చిపోయింది!" ఇంచుమించు ఇద్దరిదీ ఒకే సమాధానం.

మాధవరావు ఏమీ మాట్లాడలేదు. వాళ్లు వెళ్ళిపోయారు. మొదటిసారిగా వాసుదేవరావు చాలా విసుక్కున్నాడు కార్లో ఇంటికివస్తూ..."వసూ! గతాన్ని తవ్వుకోవటం, ఇతరుల దృష్టినాకర్షించటం తప్ప మరో ఆదాయంలేదు. గౌరవనీయుడైన లాయరు భార్యవి. ఇద్దరు బిడ్డల తల్లివి. ఇలా చవకగా ఎక్కడపడితే అక్కడ నా మొదటిభర్త, పిల్లలు అంటూ ఎగబడటం బాగాలేదు. నిజంగా నీకు ఆ భర్తదగ్గరా, ఆ పిల్లల దగ్గరా శాంతీ, సుఖమూ వున్నాయనుకుంటే అక్కడికే వెళ్ళు, నేను అడ్డు చెప్పను!"

వసంత తల వంచుక్కూర్చుంది. తనిప్పుడు తిరిగీ మరోసారి పొరపాటు చెయ్యలేదు! సుజాత, బాబు...వాళ్ళిద్దరి భవిష్యత్తుల్నీ నాశనం చెయ్యలేదు. యౌవనం పోయింది. వార్ధక్యం రాబోతోంది. ఈ రోజు తనకు స్వాగతం పలికేవారెవరు? ఒకనాటి తన ఆలోచనలూ, ఆవేశాలూ ఎంతటి పేలవమైనవో తెలుస్తోంది! మాధవరావు తనమీద కురిపించిన ప్రేమలో పదహారో వంతయినా తను గ్రహించివుండగలిగి వుంటే...

"మన బేబీకి డిగ్రీ రాగానే పెళ్ళి చేద్దాం వసూ! ఆడపిల్లలు నాగరికత ముదిరేకొద్దీ లేనిపోని ఆలోచనలు జేస్తున్నారు!" అంటున్నాడు తరచూ వాసుదేవరావు.

మధురిమ పెళ్ళి?

ఎవరో పెళ్ళిచూపులకువచ్చి అన్నారట "తల్లి భర్తనీ, బిడ్డలనీ వదిలేసింది కూతురు మనల్ని ఉద్ధరిస్తుందా?" అని.. ఆ బాధ ఎవరితో చెప్పుకుంటుంది మధురిమ. ఎలా మర్చిపోగలడు మాధవరావు. రోజు రోజూ అలాటి ఎన్ని తిరస్కారాలూ, వ్యంగాలూ, బాణాలు ఎదుర్కొని పెరుగుతున్నారో, మధురిమ బాబు! ఇక వాళ్లు తనని ఎలా గుర్తిస్తారు? ఎందుకు గౌరవిస్తారు?

'మానవత' లేని 'నవత' సాధించింది తను. ఇదీ మా 'నవత' అని అసహ్యకరమైన జీవితాన్ని ఋజువు చేసింది, తను.

వాసుదేవరావులో వసంత ఆలోచనలు పసికట్టినకొద్దీ సహనం చచ్చిపోతోంది.

"నువ్వేదో స్త్రీజాతి ఉద్ధారకురాలివనుకున్నాను. అంతా నటనా? భ్రమా?" అంటూ విసుక్కుంటున్నాడు.

స్త్రీ అంటే తనలాటి రాతిహృదయంగల వ్యక్తా? తనలాటి చంచల స్వభావురాలా? తనలాటి స్వార్థపూరితురాలా? ఇదా నవత?

ఈరోజు మధురిమ పెళ్ళి...ఎన్ని బాధలుపడి చేస్తున్నాడో మాధవరావు... తల్లిగా తను బాధ్యత వదిలించుకుంది!

మధురిమను తను కన్నందుకు మాత్రమే, ఆమె పెళ్ళిశుభలేఖ పంపాడు —అంతేగానీ రమ్మన్న పిలుపూ, కోరికా లేదు...

* * *

"వసూ! వసూ!" హడావుడిగా కేకలువేస్తూ వచ్చాడు వాసుదేవరావు. వసంత ఆలోచనలు ఎక్కడివక్కడే ఎగిరిపోయాయి. గతమంతా మాయమై వర్తమానం ముందు నిలిచింది.

"టెన్నిస్ ఆడుతుంటే, రాకెట్ పొరబాటుగా మూతికి తగిలి పన్ను ఎగిరిపోయిందోయ్! డాక్టర్ దగ్గరకు వెళ్ళొస్తున్నాను. వారంరోజుల్లో కొత్త పన్ను కట్టిస్తానన్నాడు..." జేబులో నుంచి ఊడినపన్ను తీసి చూపిస్తూ అన్నాడు వాసుదేవరావు నోరు తొర్రిగా కొత్తగా వుంది.

"అరె! ఎంత పెద్దరోజు! పన్ను ఇదే పెట్టడానికి వీలౌతుందేమో కనుక్కోలేకపోయారా?" అంది ఆదుర్దాగా వసంత.

వాసుదేవరావు పకపక నవ్వాడు... "నువ్వు చదువుకోలేదటోయ్ చిన్నప్పుడు... కేశములు, నఖములు, దంతములు వాటి వాటి స్థానాల్లో వున్నప్పుడు వాటి విలువ వేరు, స్థానభ్రష్టత్వం పొందాక వాటికసలు విలువేలేదనీ! ఒకసారి ఊడాక అతకలేరు ఏ డాక్టర్లూ!" అన్నాడు.

"అవునవును... స్త్రీకూడా అంతే, స్థానం తప్పాక...ఎందుకూ కొరగాని పన్ను, వెంట్రుక, గోరు లాటిదే! ఆ చిన్న సత్యం తెలుసుకోడానికి మాధవరావు, మధురిమ, బాబుల... జీవితాలను పణంగా పెట్టాను! నేనినాడు మీ ఊడిన పన్నులాటిదాన్నే!" అనబోయింది. అనలేకపోయింది.